

మాడుగుల మండలంలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలో బోయతిలి, కిల్లంకోట పంచాయతీలోని పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ గురువారం సందర్శించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కిల్లంకోట గ్రామంలో రహదారి నిర్మాణ పనులను పరిశీలించి, త్వరగా పనులు పూర్తి చేయాలని, నాణ్యత లోపం లేకుండా చూడాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.పలు పాఠశాలలను సందర్శించి పలు అంశాలపై విద్యాశాఖ అధికారులతో చర్చించారు. మద్ది గరువు వారపు సంతలో నిత్యావసర సరుకుల దుకాణాలను పరిశీలించి, నకిలీ వస్తువుల అమ్మకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



వస్తువులు పరిశీలిస్తున్న కలెక్టర్



పాఠశాల రేకుల షెడ్డు వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

రేకుల షెడ్డులోనే చదువులు..!

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : మండలంలోని పెదగూడ పంచాయతీ పరిధి పనస గ్రామంలో సుమారు పదేళ్లుగా విద్యార్థులు రేకుల షెడ్డులోనే విద్యా బోధన సాగిస్తున్నారు. ఈ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. 2024 ఏడాది బడి ఈడు పిల్లలు 13 మంది చదువుతున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు చేయి చేయి కలుపుకొని చందాలు వేసుకుని రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. రేకుల షెడ్డులో సుమారు పదేళ్లుగా విద్యా బోధన అందిస్తున్న నేటికీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదని గ్రామస్తులు చెట్టి గణపతి, పూజారి సోమేశ్వరరావు, చెట్టి కేశవరావు, పూజారి హరికృష్ణ, పూజారి శ్రీను, పూజారి గోవిందు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల పాకను తలపిస్తున్న రేకుల షెడ్డులో తమ చిన్నారులకు విద్యాభ్యాసం సంవత్సరాలుగా కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వ అధికారులకు పట్టడ లేదన్నారు. అధిక వర్షాలు కురిసినప్పుడు బల్లులు, తేళ్లు, సర్పాలు రేకుల షెడ్డులోకి ప్రవేశిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రేకుల షెడ్డులో విద్యాబోధన కష్టాతరంగా మారిందని ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాఠశాల భవనం నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు, ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పూజారి ఎలిసా, పూజారి గోపాల్ , పూజారి నీలమ్మ, పూజారి అనిల్ అనిల్, చెట్టి రాజేశ్వరి ప్రభుత్వాన్ని కోరారు.



ర్యాలీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, వైద్యులు

అధిక జనాభాతో అనర్థాలు

- పలు చోట్ల ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు: పాడేరులో ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమల్ భాష, మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సాయి శ్రీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏఎన్ఎం ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ నుండి పాత బస్టాండ్ అంబేద్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు నినాదాలు చేస్తూ అధిక సంతానం వద్దే వద్దు, ఇద్దరు పిల్లలు ఇంటికి ముద్దు, చింతలేని కుటుంబం చిన్న కుటుంబం, ప్రపంచ జనాభాను తగ్గిద్దాం. పెరుగుతున్న జనాభా తరుగుతున్న వనరులు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమల్ భాష మాట్లాడుతూ.... జనాభా పెరుగుదలను ప్రపంచంలో ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. అధిక సంతానంతో ఆరోగ్య, ఆర్థిక సమస్యలు కూడా ఏర్పడతాయని తెలిపారు. పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని, మందబుద్ధి పిల్లలు పుట్టే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుల్లేలి సింహాద్రి ఎం.పి హెచ్ఈఓ వరలక్ష్మి హెచ్‌వి ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఫ్యాకల్టీ గణేశ్వరి, సుజాప్న, శెట్టి నాగరాజు, కె. లక్ష్మణరావు, జే వి చలం, కృష్ణవేణి, బుజ్జి, నాగరాజు పాల్గొన్నారు

అరకులోయ : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అరకులోయ ఏపీఆర్ గురుకుల కళాశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక జనాభాతో కలిగే అనర్థాలను, పరిమిత సంతానంతో కలిగే లాభాలు, కుటుంబ నియంత్రణపై వైద్యాధికారి నాయుడు అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో గన్నెల పిఎస్‌సి హెల్త్ ఎడ్యుకేటర్ టిఎస్ఎన్ మూర్తి, సిబ్బంది, ఏపీ ఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



అరకులో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



దమ్ముదుక్కి మడిని తలపిస్తున్న రామగెడ్డ - చాపగెడ్డ రహదారి

రామగెడ్డ-చాపగెడ్డ రహదారి అస్తవ్యస్తం

- దమ్ము మడిని తలపిస్తున్న వైనం

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధి రామగెడ్డ నుంచి చాప గెడ్డ మధ్యలో మట్టి రహదారి అస్తవ్యస్తంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి బురదమయమై దమ్ము దుక్కి దున్నిన మడిని తలపిస్తోంది. దీంతో ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. పాదచారులు సైతం నడిచి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి బురదమయంగా ఉండడంతో ఆయా గ్రామాల గిరిజనులు అత్యవసర సమయంలో వైద్య సేవలు పొందడానికి కూడా రహదారి సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారని సిపిఎం మండల నాయకులు గడుతూరి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి తెచ్చుకోవడం కూడా కష్టతరంగా మారిందని వాపోయారు. మారుమూల గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం లేక గిరిజనులు అనేక ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని, ప్రభుత్వాలు పాలకులు మారుతున్న గిరిజనులు తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే తారు రోడ్డు నిర్మాణం చేయాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు.



సిసి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి లక్ష్మి, సిపిఎం నాయకులు

సిసి రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి రేఖపల్లి గొల్లగూడెం, రేఖపల్లి గ్రామాల్లోనూ, పెద్దమట్టపల్లి పంచాయతీ పరిధి గుర్రంపేట, పెద్దమటపల్లి గ్రామాల్లోనూ చేపట్టిన సిసి రోడఉల నిర్మాణ పనులను ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా ఏ అభివృద్ధి జరగలేదని, రోడ్లన్నీ గోతులతో దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రోడ్లు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మండలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి అధికారులతో మాట్లాడి సిసి రోడ్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. గుత్తేదారులు సకాలంలో నాణ్యతతో సిసి రోడ్లను నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, సిరవు తాతబాబు రెడ్డి, పాల్గొన్నారు.

రింగు రోడ్డు పనులు ప్రారంభించాలని..

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి అనంతగిరి: రింగు రోడ్డు పనులు తక్షణమే పున్ణప్రారంభించాలనీ కోరారుతూ గిరిజనులు బోనురు రోడ్డు వద్ద గురువారం మొకాళ్ళ తో చేతులు జోడించి నిరసన చేపట్టారు. రోడ్డు పనులు పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించిన సంబంధిత అదికారుల పై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సత్యారావు, .కొండబాబులు మాట్లాడుతూ మండలంలోని పినకోట, కవర్ల, పెద్దకోట పంచాయితీ పరిధిలో 12 గ్రామాల ప్రజలు గత 2020 సంవత్సరాల్లో శ్రమదానంతో రోడ్డు పనులు చేశారన్నారు. దీనికి స్పందించిన ప్రభుత్వం రూ.20 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణం కోసం 2020 సంవత్సరంలో అదికారులు పనులు మొదలుపెట్టారని తెలిపారు.క్రషర్ బుగ్గి చల్లి వదివేయడంతో వర్షాలకు రోడ్డు కోతకు గురై వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పిఒ పర్యటించి పనులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోనూరు, చీడిమెట్టు, టెంగలబంద గ్రామల గిరిజనులు పాండవుల సత్యారావు, కొండబాబు, బుచ్చన్న, సన్యాసిరావు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న గిరిజనులు



అధికారులకు సూచనలు ఇస్తున్న పిఒ అభిషేక్

ఐటిడిఎ పిఒ ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి -అనంతగిరి: చదువుకునే దశలో విద్యార్థులు మత్తు పదార్థాలు, చెడు అలవాట్లు ఉన్నట్లు తమ దృష్టికి వస్తే పాఠశాల హెచ్ఎం, వార్డెన్, సిబ్బంది పై చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ పిఒ అభిషేక్ తెలిపారు.గురువారం మండలంలో పరిటాలకు వచ్చిన పిఒ ముందుగా టోకూరు పంచాయతీ పూలగుడ గ్రామంలో చెక్ డ్యామ్ పనులను పరిశీలించారు. అనంతరం శివలింగపురం బాలుర పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించడంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో డిడి కొండలరావు పాల్గొన్నారు

పిఓకు వినతుల వెల్లువ

ఐటీడీఏ ప్రాజెక్టు పిఓ అభిషేక్‌ను సీపీఎం బృందం కలిసి పలు సమస్యలపై లిఖితపూర్వకంగా విన్నవించారు. కివర్ల, పిన్నకొట, పెదకొట, టోకురు బొర్రా పంచాయతీ గ్రామాలకు అసంపూర్తిగా రోడ్డు పనులు చేసి 2 కోట్ల 50 లక్షలు సంబదిత అదికారులు స్వాహాకు పాల్పడ్డారన్నారు. నిలిచిన జూనియర్ కాలేజ్ హాస్టల్ నిర్మించాలని, అనంతగిరి పంచాయతీ మోడల్ కాలనీ విలేజ్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. టోకురు పంచాయతీ కి చెక్ డ్యామ్ లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్. కె.మొస్య, సీపీఎం మండల కార్యదర్శి. ఎస్.నాగులు, మాజి సర్పంచ్ ఎస్.దొన్ను, ఉప సర్పంచ్. జి.నర్సన్న పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-అనంతగిరి: పశువుల వ్యాదులను అరికట్టేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని కాశిపట్నం పశు వైద్య అదికారి సాగరి గణేష్శ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పినకోట పంచాయతీ వెలగలపాడు, బల్లగరువు, మల్లంపేట, చింతపాక, కీవర్ల పంచాయితీ పూతికపుట్టు, జాలాడలో.తదితర గ్రామాల్లో ప్రత్యేక పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధి బారిన పడిన పశువులకు చికిత్స అందిచామన్నారు. 248 పశువులకు లంపి చర్మవ్యాధి నిరోధక టీకాలు, 38 గేదెలకు గొంతువాపు, 590 మేకలకు చిటుకు, 76 గొర్రెలకు నీలి నాలుక నిరోధక టీకాలు వేశామన్నారు. వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పినకోట, కివర్ల ఎంపీటీసీలు, జూనియర్ వెటర్నరీ అదికారిణి సుధావాణి, సచివాలయ పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

2022 వరద ముంపు గ్రామాలను

41.15 కాంటూరులో చేర్చి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

- పరిహారం చెల్లించి, నిర్వాసితులను తరలించాకే ప్రాజెక్టు పనులు

- సదస్సులో పలు పార్టీల నాయకులు, నిర్వాసితుల డిమాండ్



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి ఐవి

ప్రజాశక్తి -ఎటపాక

2022 నాటి వరదల సమయంలో ముంపునకు గురయ్యే ప్రతి గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించాలని పలు పార్టీలకు చెందిన నాయకులు, పోలవరం నిర్వాసితులు డిమాండ్ చేశారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించి, వారిని పునరావాస కాలనీలకు తరలించిన తరువాతే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. మండలంలోని నందిగామలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కాకా అర్జున్ అధ్యక్షతన గురువారం పోలవరం నిర్వాసితుల సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన్న సిపిఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపైనే దృష్టి పెట్టాయి గాని, నిర్వాసితుల సమస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి నుండి నేటి వరకు ఉన్న ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులను పట్టించుకోకుండా నిర్మాణం కొనసాగిస్తుంటే నిర్వాసితులకు న్యాయం చేయాలని తొలి నుండి సిపిఎం పోరాటం చేస్తుందని చెప్పారు. గతంలో పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం నెల్లిపాక నుండి విజయవాడ వరకు పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ పోరాటం తరువాతే కూనవరం, విఆర్ పురం మండలాల్లో కొత్తగా కొన్ని గ్రామాలను మొదటి కాంటూరులో ప్రభుత్వం కలిపిందని చెప్పారు. పార్టీలకు అతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాటం చేసినప్పుడే పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. వైసీపీ మండల కన్వీనర్ తానికొండ వాసు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు ప్రయత్నం చేశామని, ఇకముందు కూడా నిర్వాసితుల పోరాటానికి సంఘీభావంగా ఉంటామని చెప్పారు. అనంతరం పలు డిమాండ్లపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం రాశారు. 2022 గోదావరి వరదల్లో మునిగిన ప్రతి గ్రామాన్ని 41.15 కాంటూరు ముంపు జాబితాలో చేర్చాలని, ప్రతి కుటుంబానికీ పునరావాసం కల్పించాలని, గతంలో లక్షా పదిహేను వేల రూపాయలు పరిహారం ఇచ్చిన భూములకు రూ.10లక్షలు ఇవ్వాలని, పరిహారం కల్పించాకే నిర్వాసితులను తరలించాలని, ఆ తరువాతే ప్రాజెక్ట్ పనులు చేపట్టాలని, పోలవరానికి భూములిచ్చిన రైతులకు ఇకెవైసి చేసి రుణ సదుపాయం కల్పించాలని, పంట నష్ట పరిహారం చెల్లించాలని ఈ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ ఇంగిలపు బేబీ, ఉప సర్పంచ్ పులుసు బాలకృష్ణ, వార్డ్ మెంబరు కందుల సతీష్, టీడీపీ నాయకులు మద్దిబోయిన రవి, సిపిఎం మండల కమిటీ సభ్యులు సోందే రామారావు, సీనియర్ నాయకులు పులుసు సూర్యనారాయణ, వైసీపీ నాయకులు గొడపర్తి చిన్న నాగయ్య, యాలం సీతయ్య, చంద్ర సుధాకర్, పర్సిక ధర్మరాజు, ఊకె బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సిఎం, డిప్యూటీ సిఎం ఫొటోలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలను ఎన్‌డిఎ కూటమి నాయకులు గురువారం అందజేశారు. మండలంలోని ఎంపీడీవో, తహశీల్దారు కార్యాలయాలతో పాటు గ్రామ సచివాలయాలు, ఇతర కార్యాలయాలకు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు రాజ్ కుమార్ రెడ్డి పల్లాల, గురుకు శేష్ కుమార్, మల్ల దుర్గాప్రసాద్, పోడియం శ్రీనుబాబు, కర్రి సన్యాసి రెడ్డి, దూడ సువర్ణ కర్ణ కుమార్, భీశెట్టి అప్పాజీ, పుచ్చల గురునాథరెడ్డి, మల్లుల శివన్నారాయణ, దూడ ప్రణీత్, మండా రత్నాజీ, కాసగాన వంశీకృష్ణ, షేక్ ఖాదర్, అందాల సూర్యనారాయణ రెడ్డి, షేక్ మస్తాన్, పొడియం కన్నపుదొర, మల్లా బలరాం, కోడూరు సత్యనారాయణ, పెదకం శెట్టి రాము, ఏరుబండి రాంబాబు, కురసం బాబన్న దొర, భీశెట్టి శివరాజ్, పాము రాంబాబు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫొటోలను అందిస్తున్న కూటమి నాయకులు




బోరును ప్రారంభించిన జమాల్ ఖాన్

బిసి కాలనీలో తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండల కేంద్రం బిసి కాలనీలో జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ద్వారా తీయించిన తాగునీటి బోరును గురువారం ట్రస్టు చైర్మన్, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ ప్రారంభించారు. బిసి కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో బోరు ఏర్పాటు చేయాలని జమాల్‌ఖాన్‌కు కాలనీ వాసులు విజ్ఞప్తి చేయగా, ఆయన వెంటనే స్పందించి తమ ట్రస్టు నిధులు రూ.70వేలు వెచ్చించి చేతిపంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చి అవకాశం తనకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెకెసి ట్రస్టు సభ్యులు షాజహాన్, రియాజ్, నటరాజ్, కాలనీవాసులు వడారి రాము, పి.సాయిబాబు, ఎర్రం నాగమణి, ముక్కెర సుబ్బాయమ్మ, రమణమ్మ, ఏమ్బడి కశింబి, పచ్చిక రమణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- అడ్డతీగల : అడ్డతీగల మండలం రాయపల్లి పంచాయతీ వంగలమడుగు గ్రామానికి చెందిన పరిషిక వెంకటేశ్వర్లు అనే భవన నిర్మాణ కార్మికుడు అనారోగ్యంతో బాధపడుతుండగా, వినాయక తాపీ పని వారి సంక్షేమ సంఘం నాయకులు ఆయనకు రూ.5వేలు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి గుల్లా సురేష్ బాబు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు కుటుంబాన్ని యూనియన్ తరపున ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మాజీ అధ్యక్షులు చింతాజీ అబ్బులు, వైస్ ప్రెసిడెంట్ చాగంటి ఆదినారాయణ, లింగం పెద్దకాపు, లింగం బుజ్జి, లోవరాజు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న తాపీ పని వారి సంక్షేమ సంఘం నాయకులు



ఘాట్ రోడ్లో తేనె విక్రయిస్తున్న వ్యక్తి

ఏజెన్సీలో జోరుగా కల్తీ తేనె అమ్మకాలు

నమ్మి మోసపోతున్న పర్యాటకులు

ప్రజాశక్తి- అరకులోయ : పర్యాటక కేంద్రమైన అనంతగిరి, అరకులోయ పరిసర ప్రాంతాల్లో కొంతమంది మైదాన ప్రాంతానికి చెందిన వ్యక్తులు కల్తీ తేనె విక్రయిస్తున్నారు. పర్యాటక కేంద్రమైన అరకులోయకు ప్రతి ఏడాది వేల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తుంటారు, ఇక్కడి దొరికే ప్రకృతి తేనె మంచి గిరాకీ ఉండడంతో దాన్ని ఆసరాగా చేసుకుని అరకు సందర్శనకు వచ్చి పోయే సందర్శకులే లక్ష్యంగా కల్తీ తేనె అమ్మకాలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. గుంటూరు, తదితర ప్రాంతాలకు చెందిన అనేకమంది ఇక్కడకు వచ్చి ఎక్కడపడితే అక్కడ తేనె బాక్సులు పెట్టి తేనెను సేకరిస్తుంటారు. అయితే ఇక్కడున్న డిమాండ్ను కొంతమంది మైదాన ప్రాంతంలోని ఎస్ కోట, బొడ్డారా తదితర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఏజెన్సీలో ప్రవేశించి స్వచ్ఛమైన తేనె ముసుగులో కల్తీ తేనె విక్రయిస్తూ అరకు, అనంతగిరి ఘాట్ రోడ్ లో దర్శనమిస్తున్నారు. ఏజెన్సీలో తేనె ను పోలిన ప్లాస్టిక్ తేనె పట్టులో పంచదార పాకం, బెల్లం పాకంతో అచ్చం తేనెను తలపించే విధంగా తేనెను తయారుచేసి అచ్చట అడవి నుంచి సేకరించి తెస్తున్నట్లు నమ్మబలికి పర్యాటకులకు అంటగడుతున్నారు.ఇదే నిజమైన తేనె అని నమ్మి అనేక మంది పర్యాటకులు కొనుగోలు చేసి మోసపోతున్నారని పలువురు భావిస్తున్నారు. దీనిపై అరకులోయలో అసలైన తేనె పెంపకందారులు కల్తీ తేనె విక్రయదారులతో అనేకసార్లు గొడవలు పడి, అరకు ప్రభుత్వ డిబ్యాక్టర్ వాగ్వాదానికి దిగిన సందర్భాలు ఉన్నాయి. అయినా ఘాట్ రోడ్ లో కల్తీ తేనె విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. కల్తీ తేనె కొనుగోలు చేసి పర్యాటకులు మోసపోవద్దని పర్యాటకులను అసలైన తేనె విక్రయదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అటువంటి వారి వల్ల తమకు కూడా చెడు పేరు వచ్చే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకు, అనంతగిరి ఘాట్ రోడ్ లో ఎవరు ప్లాస్టిక్ సంచులతో తేనె అమ్మిన తేనె కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో తీవ్రంగా మోసపోతారని స్పష్టం చేస్తున్నారు. తేనె అవసరమైన పర్యాటకులు జిసిసి స్టాల్స్లో, జిసిసి సూపర్ మార్కెట్లో విక్రయించే నాణ్యమైన తేనెను కొనుగోలు చేసుకోవాలని జిసిసి అధికారులు చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -పాడేరు: విద్యుత్ లైన్ల, విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు, చెట్లకొమ్మలు తొలగింపు తదితర పనుల నిమిత్తం పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలతో పాటు హుకుంపేట మండలంలోని బాకూరు అడ్డుమంద గ్రామాలకు ఈనెల 12న శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ పాడేరు కార్యనిర్వాహక ఇంజనీర్ ఏవిఎస్ఎం అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని తెలిపారు.

నిలిచిన బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్స్

ప్రజాశక్తి- పెదబయలు: మండల కేంద్రంలో వారం రోజులుగా మూగబోయిన బిఎస్ఎన్ఎల్ సెల్ సేవలను పునరుద్ధరించాలని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. వర్షాలు మొదలు కావడంతో గత నెల రోజులుగా సెల్ సిగ్నల్ అంతరాయం ఏర్పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఇంటర్నెట్ సేవలు నిలిచి పోవడంతో గత వారం రోజులుగా ప్రభుత్వ ప్రైవేట్ కార్యకలాపాలు స్తంభించి పోయాయి. అధికారులు స్పందించి సెల్ సేవలు మెరుగు పర్చాలని వినియోగదారులు కోరారు.

సుగర్ ఫ్యాక్టరీలకు శాశ్వత పరిష్కారం

ఇథనాల్ తయారీకి ఉపయోగించాలి : సిఎం చంద్రబాబునాయుడు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా విశాఖ, అనకాపల్లి జిల్లాలకు వచ్చిన చంద్రబాబు గురువారం రోజంతా వివిధ కార్యక్రమాలతో బిజీ షెడ్యూల్ నిర్వహించారు. తొలుత అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువను పనులు పరిశీలించారు. తర్వాత విశాఖలో మెడ్ టెక్ జోన్లో గ్లోబల్ మెడ్ టెక్ యూనివర్శిటీని, సైక్లో ట్రాన్ సెంటర్లను ప్రారంభించారు. సాయంత్రం 6.30గంటలకు ఎయిర్ పోర్టులో విశాఖపట్నం జిల్లా ఉన్నతాధికారులు, పోర్టు అధికారులతో సమావేశం అయ్యారు.



మెడ్ టెక్ జోన్లో మెడికల్ మెటీరియల్ సెంటర్ను ప్రారంభిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, గ్రేటర్ విశాఖ బ్యూరో

అనకాపల్లి జిల్లాలో రైతులకు న్యాయం జరిగేలా వారి భాగస్వామ్యంతో మూతపడ్డ మూడు సుగర్ ఫ్యాక్టరీలలో ఇథనాల్ తయారీకి ఉపయోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రైతులకు న్యాయం చేయడం ఎన్డిఎ ప్రభుత్వ మొదటి కర్తవ్యమన్నారు. ఎస్.రాయవరం మండలం, దార్లపూడి వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ అక్విడెక్ట్ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డంతో రైతులకు అన్యాయం జరిగిందని, ఉద్యోగులకు జీతాల్లేవనే పరిస్థితిలేకుండా, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేసి చూపిస్తామని చెప్పారు. ఈ పని జరిగేలా ఎమ్మెల్యేలతో మాట్లాడే బాధ్యత ఎంపీ సిఎం రమేష్, మంత్రి అనితకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి అనకాపల్లి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు దార్లపూడి హెలిపాడ్ వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. శాసనసభ స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్బాబు, సుందరపు విజయ్కుమార్, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పి కెవి మురళీకృష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

గ్లోబల్ యూనిక్ హబ్గా మెడ్ టెక్ జోన్

వైద్య పరికరాల (మెడికల్ డివైసెస్) తయారీలో గ్లోబల్ యూనిక్ హబ్గా విశాఖ మెడ్ టెక్ జోన్ అవతరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్షించారు. గురువారం ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా సాయంత్రం 5గంటలకు విశాఖలోని మెడ్టెక్ జోన్ సిబ్బంది, భాగస్వాములను ఉద్దేశించి ప్రసంగించారు. గ్లోబల్ మెడ్ టెక్ యూనివర్శిటీని, సైక్లో ట్రాన్ సెంటర్లను ఈ సందర్భంగా ఇక్కడ ప్రారంభించారు. దేశంలోని 20 రాష్ట్రాలకు ఇక్కడి నుంచే మెడికల్ డివైసెజ్ ఎంఆర్ఐ, సిటి స్కాన్ వంటివి ఉత్పత్తయి సరఫరా అవుతున్నాయని, ఒక్క ఆంధ్రప్రదేశ్లో గత ప్రభుత్వమే వినియోగించకపోవడం దారుణమని పేర్కొన్నారు. హెల్త్ కేర్లో 28 రకాల వైద్య పరికరాల తయారీ జరుగుతుండడం మంచి పరిణామమన్నారు.

మెడ్ టెక్ సిఇఒ జితేంద్ర శర్మ స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిదని కొనియాడారు.

పారిశ్రామిక వేత్తను ప్రోత్సహిస్తాం

గత ప్రభుత్వం మాదిరిగా పెట్టుబడులను అడ్డుకునే ప్రభుత్వం తమది కాదని, రాష్ట్రాభివృద్ధి కోసం పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి తగిన గౌరవం ఇస్తామని అటు కేంద్రం, ఇటు రాష్ట్రం మీకు అండగా ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిఐఐ ప్రతినిధులకు భరోసా ఇచ్చారు.

ఎయిర్పోర్టులో అధికారులతో సమీక్ష

గురువారం సాయంత్రం 6.30గంటలకు ఎయిర్ పోర్టులో విశాఖపట్నం జిల్లా ఉన్నతాధికారులు, పోర్టు అధికారులతో సమావేశం అయ్యారు. గత ఐదేళ్లలో ఉత్తరాంధ్రకు తీవ్ర నష్టం జరిగిందని తాగునీటి ప్రాజెక్టులన్నీ మూలనపడ్డాయని చెప్పారు. పుష్కర లిఫ్ట్ నుంచి అనకాపల్లికి నీరు తేవాలంటే రూ.800కోట్లు ఖర్చుచేయాలని, ఇది పూర్తయితే 2 లక్షల ఎకరాలకు నీరొస్తుందని తెలిపారు. 2026 నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తిచేస్తామన్నారు. ట్రైబల్ యూనివర్శిటీకి గతంలో ఎక్కడైతే స్థలం ఇచ్చామో పనులు అక్కడే మొదలుపెడతామని చెప్పారు. రైల్వేజోన్కు అవసరమైన భూమి ఇవ్వలేదనే వివాదం ఉందని, వారికి ఆమోదయోగ్యమైన స్థలం ఇచ్చి రైల్వే జోన్ పనులను చేపడతామని తెలిపారు. పంచ గ్రామాల సమస్యను, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని అధికారులకు తెలిపారు. దక్కన్ క్రానికల్ కార్యాలయం ఎదుట ఇటీవల టిడిపి శ్రేణుల నిరసనలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ, తప్పు చేసిన వారి ఆఫీసుల వద్ద నిరసనలు అవసరం లేదని చట్ట ప్రకారం ముందుకెళదామని సూచించారు. విశాఖ పోర్టులో పొల్యూషన్ను తగ్గించాల్సి ఉందని దీనిపై ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలన్నారు. సింహాచలం భూముల్లో చాలామంది ఇల్లు కట్టుకున్నారని అన్నీ పరిశీలించి అనుమతులివ్వాలని సూచించారు.

విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్నీ బదిలీ

ఆ పోస్టులోకి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం రేంజ్ డిఐజిగా విధులు నివహిస్తున్న 2010 ఐపిఎస్ బ్యాచ్కు చెందిన విశాల్ గున్నిని తదుపరి పోస్టింగ్ ఇచ్చే వరకు డిజిపి కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరాబ్ కుమార్ ప్రసాద్ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్ డిఐజిగా విధులు నిర్వహిస్తున్న 2008 ఐపిఎస్ బ్యాచ్కు చెందిన గోపీనాథ్ జట్టిని విశాఖపట్నం రేంజ్ డిఐజిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



భవనాన్ని తొలగిస్తున్న యజమానులు

జాతీయ రహదారిలో భవనం తొలగింపు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరుకు పంచాయతీ కేంద్రంలో జాతీయ రహదారికి అనుకుని నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని తొలగించాలని మూడు రోజుల క్రితం జాతీయ రహదారి అధికార యంత్రాంగంతో పాటు స్థానిక పంచాయతీ, రెవెన్యూశాఖ అదికార యంత్రాంగం కలిసి నోటీసులు జారీ చేశారు. నిర్మాణదారులు నిర్దేశించిన గడువులోగా తొలగించకపోతే తామే అధికారికంగా తొలగింపుకు చర్యలు తీసుకుంటానని సంబంధిత అధికారులు హెచ్చరించారు. దీంతో నిర్మాణదారుడు భవన నిర్మాణాన్ని గురువారం తొలిగించారు.

విజయనగరం-రాయగడ సెక్షన్లో డిఆర్ఎం తనిఖీలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ గురువారం వాల్తేర్ డివిజన్ లోని విజయనగరం-రాయగడ రైల్వే సెక్షన్లో తనిఖీలు నిర్వహించారు. ఆ సెక్షన్లో ప్రస్తుతం జరుగుతున్న మూడో లైన్ పనుల పురోగతి, స్టేషన్ల పునరాభివృద్ధి కార్యక్రమాలు, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం రాయగడ రైల్వే స్టేషన్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సర్క్యులేటింగ్ ప్రాంతాలు, పార్కింగ్ సదుపాయాలు, స్టేషన్ భవనాల మెరుగుదల, రైల్వే కాలనీ అభివృద్ధి తదితర అంశాలను పరిశీలించారు. కెయుట్గూడ స్టేషన్లో తనిఖీ సందర్భంగా, సౌరభ్ ప్రసాద్ భద్రతా ఆడిట్ నిర్వహించారు. అనంతరం విజయనగరం నుంచి రాయగడ వరకు విండో-ట్రైలింగ్ తనిఖీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 7,8,9 తేదీలలో విశాఖలో ఎఐటియుసి జాతీయ సమావేశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబర్ 7, 8, 9 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్జె అచ్చుతరావు తెలిపారు. అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సమావేశాలకు దేశ నలుమూలల నుంచి 500 మంది ఎఐటియుసి జాతీయ అగ్ర నాయకత్వం రానున్నారని తెలిపారు. సమావేశాల మొదటి రోజు కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయని చెప్పారు. జాతీయ సమితి సమావేశాలు స్టీల్ప్లాంట్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానలపైన, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాలపైనా, అసంఘటితరంగ కార్మికుల సమస్యలపైన చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తారన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు, ఉపాధ్యక్షులు ఎస్కె రెహమాన్, కోశాధికారి కె.సత్యాంజనేయ, స్టీల్ గుర్తింపు సంఘం (ఎఐటియుసి) కోశాధికారి రాజుబాబు పాల్గొన్నారు.

కెజిహెచ్కు ఫల్స్ జనరేటర్, లెడ్ పరికరాల విరాళం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర మెడికల్ కాలేజీ, కార్డియాలజీ పూర్వ విద్యార్థి డాక్టర్ ఎ.సురేష్, (కార్డియాలజిస్ట్) రూ.1.4 లక్షలు విలువ చేసే తాత్కాలిక పేస్ మేకర్కు అవసరమైన పల్స్ జనరేటర్, లెడ్ పరికరాలను కెజిహెచ్ కార్డియాలజీ విభాగం ఐసియుకు విరాళంగా అందించారు.

నాణ్యమైన విద్యుత్ను అందించడమే లక్ష్యం

అంతరాయం లేకుండా సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ

ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్



వీడియో కాన్ఫరెన్స్లో మాట్లాడుతున్న ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్

ప్రజాశక్తి- సీతమ్మధార : వినియోగదారులకు ఎటువంటి అంతరాయాలు లేకుండా, నాణ్యమైన విద్యుత్ను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలకనుగుణంగా సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పర్యవేక్షక ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల వరకు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా అంతరాయాలను నివారించేందుకు పలు సూచనలు చేశారు. జిల్లాలవారీగా తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను గుర్తించేందుకు 33 కెవి ఫీడర్స్, 11 కెవి ఫీడర్స్ను ఎంపిక చేసుకొని వాటిని సర్వే చేసి లోపాలను పిఎంఐ సర్వే మొబైల్ యాప్లో నమోదు చేస్తారని తెలిపారు. ఇందులో భాగంగా గాలి వేసేటప్పుడు చెట్ల కొమ్మలు తగలడం, ఒరిగిన స్తంభాలు, తుప్పుపట్టిన స్తంభాలు, పొట్టి స్తంభాలు, స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండి వేలాడుతున్న వైర్లు, ఇన్సులేటర్ పగుళ్ల, సపోర్ట్ వైర్లు, సపోర్ట్ స్తంభాలు లేకపోవడం మొదలగు విషయాలను నమోదుచేసి వాటిని త్వరితగతిన సరిచేసి అంతరాయాలను పూర్తిగా తగ్గించి వినియోగదారులకు మెరుగైన నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు ఆదేశాలిచ్చామన్నారు. దీనికనుగుణంగా గురువారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల వారీగా సుమారు 500 ఫీడర్లలో సర్వే ప్రారంభించామన్నారు. లోపాలను పిఎంఐ సర్వే యాప్ లో నమోదుచేసి వాటిని సరిచేసి అంతరాయాలను తగ్గిస్తున్నామని తెలిపారు.కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించి వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందిస్తామన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలను టోల్ ఫ్రీ నంబర్ 1912 కు తెలియచేస్తే సకాలంలో పరిష్కరిస్తామన్నారు.

రెండో శనివారం సెలవు ఇవ్వాల్సిందే

ప్రజాశక్తి-సీతమ్మధార : అన్ని యాజమాన్యాలలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కాలేజీలకు ప్రతినెలా రెండో శనివారం సెలవును విధిగా అమలుపై ఆర్ఐఒ, ఇతర విద్యాశాఖాధికారులు దృష్టి పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. దీనిపై ఏ ఒక్కరికీ మినహాయింపులు లేవన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు రెండో శనివారం సెలవు అమలుకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై ఇప్పటికే వస్తున్న ఫిర్యాదులపై కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో పరిశీలన జరిపి చర్యలు చేపడతామన్నారు.సంబంధిత ఫిర్యాదులను apscpcr2018@gmail.com మెయిల్కు పంపించవచ్చని సీతారాం సూచించారు.

భీమిలిలో సబ్ కోర్టు ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలిలో సబ్ కోర్టు ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. గురువారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు ఎమ్మెల్యే గంటాను కలిశారు. భీమిలిలో సబ్కోర్టు ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ, దీనికి సంబంధించిన ఫైల్ ముఖ్యమంత్రి కార్యాలయంలో పెండింగ్లో ఉందని, దానిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే గంటా స్పందిస్తూ, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. అంతకుముందు బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు న్యాయవాదులు ఎమ్మెల్యే గంటాకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి పార్వతీశం, కార్యదర్శి కెఎస్ఎం సుధాకర్, కోశాధికారి ఎం.సునీల్, ఎజిపి పాత్రుడు, లాయర్లు గౌతమ్, వెంకటేష్ ,సుందర్సింగ్, భరద్వాజ్, బోని శివ, మాధవి ఉన్నారు

సీలేరు ప్రాంత సమస్యలపై వినతి

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు ప్రాంతంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలని జీకే వీధి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బోయిన కుమారికి సీలేరు ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల గ్రాంట్ నుంచి సీలేరు పంచాయతీ పరిధిలో నాలుగు బోరుబావులు నిర్మించాలని కోరారు. లైకాన్ పూర్, చంద్రుపల్లి, పార్వతి నగర్ గ్రామాలకు మంజూరైన జల్ జీవన్ పథకం పనులు పూర్తి చేయాలని, అన్ని పాఠశాలలో మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీలేరు పిహెచ్సిలో వైద్య సేవలు అందుతున్న తీరుపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఉపాధ్యాయులు నిర్ణీత సమయానికి పాఠశాలకు వచ్చి విద్యా బోధన సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతనంగా నిర్మించనున్న పంపు స్టోరేజ్ ప్రాజెక్టు వల్ల సీలేరు పార్వతినగర్ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఎపి జన్కో అధికారులతో చర్చించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ పరిధిలో కుల ధ్రువీకరణ పత్రాలు పొందడంలో కొన్ని కులాల వారికి సమస్యలు తలెత్తుతున్నాయని, అధికారులు వాటిని నివృత్తి చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో వేలిముద్ర పడని వృద్ధులకు రేషన్ బియ్యం వాలంటీర్ల ద్వారా పంపిణీ చేసేవారని, అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం హయాంలోనూ పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఎంపిపికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపిటిసి, సర్పంచ్

చింతూరు సంత.. తప్పని చింత..

రోడ్డుపైనే నిర్వహణ : ఇబ్బంది పడుతున్న పాదచారులు, వాహనచోదకులు



రోడ్డుకు ఇరువైపులా ఉన్న చింతూరు వారపుసంతలోని దుకాణాలు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వారపు సంత వల్ల వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోజు రోడ్డంతా కిక్కిరిసిన జనంతో నిండి ఉంటుంది. విలీన నాలుగు మండలాలతో పాటు ఆంధ్ర, ఒడిస్సా ఛత్తీస్ఘడ్ నుండి కూడా అధిక సంఖ్యలో వ్యాపారులు, కొనుగోలుదారులు, ప్రజలు ఈ సంతకు వస్తుంటారు. సంతకు కేటాయించిన మైదానం ఖాళీగా ఉన్నప్పటికీ వ్యాపారులు మాత్రం బ్రిడ్జి రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు పెట్టి విక్రయాలు జరుపుతున్నారు. దీంతో వ్యాపారులు, కొనుగోలుదారులు, సంతకు వచ్చే ప్రజలతో ఈ రోడ్డు మొత్తం కిటకిటలాడుతుంది. దీంతో ఈ మార్గంలో భారీ వాహనాలతో పాటు చిన్న వాహనాలు సైతం రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. పాదచారులు సైతం వెళ్లలేని స్థితి.

ఇటువంటి పరిస్థితుల్లోనే గతంలో ఒక వాహనం ఓ చిన్నారిని ఢీకొట్టడంతో ఆ చిన్నారి మృతి చెందింది. అయినా కూడా బ్రిడ్జి రోడ్డుకు ఇరువైపులా యథేచ్ఛగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.

మరో వైపు కొనుగోలు చేయడానికి వచ్చే వారు తమ ఆటోలను, ద్విచక్ర వాహనలను రోడ్డుకు ఇరువైపులా నిలపడం మరింత ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడుతుంది. సంతకు మైదానం ఉండగా రోడ్డుపై వ్యాపారాలు సాగించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సంత రోజు వ్యాపారస్తులకు కేటాయించిన సంతపాకలలో సంతజరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

పారిశ్రామిక అవసరాలకు ప్రాధాన్యత

గీతంలో డాక్టర్ రెడ్డీస్ల్యాబ్ ప్రాయోజిత బిఎస్సి కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ప్రముఖ ఔషధ పరిశ్రమ డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయనిక శాస్త్ర విభాగంతో కలిసి నిర్వహిస్తున్నబిఎస్సి కెమిస్ట్రీ డిగ్రీ కోర్సుల తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల ఎంపికతో పాటు వారి చదువుకు అయ్యే వ్యయాన్ని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ పూర్తిగా భరించడం అభినందనీయమన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా రసాయనశాస్త్రంలో పిజి కోర్సు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామనివెల్లడించారు. స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి మాట్లాడుతూ శాస్త్ర పరిశోధనలకు గీతం అధిక ప్రాధాన్యతనిస్తోందని, అధునాతన ప్రయోగశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్విఎస్ వేణుగోపాల్ బిఎస్సి కెమిస్ట్రీ కోర్సు విశేషాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ మానవ వనరుల విభాగం మేనేజర్ లక్ష్మీదుర్గ, కోఆర్డినేటర్ డాక్టర్ ఎమ్.సురేష్, డాక్టర్ అలిస్ రింకి రోబర్ట్ పాల్గొన్నారు.

'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్తో సులభంగా విద్యుత్ బిల్లుల చెల్లింపులు

ప్రజాశక్తి- సీతమ్మధార: ఇటీవల సరికొత్త ఫీచర్లతో ఎపిఇపిడిసిఎల్ ప్రారంభించిన 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులను సులభంగా చెల్లించవచ్చని సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం తెలిపారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ ను వినియోగిస్తున్న వినియోగదారుల సంఖ్య కేవలం వారం రోజుల్లోనే లక్ష నుంచి 5.07 లక్షలకు పెరిగిందన్నారు. రోజువారీ లావాదేవీలు ఐదు వేలు నుంచి 70వేలకు పెరిగాయన్నారు. మొబైల్ యాప్ ద్వారా గత నెల మొదటి 10 రోజుల్లో రూ.3 కోట్లు విద్యుత్ బిల్లులు వసూలు కాగా, ఈ నెల 10 తేదీ వరకు యాప్ ద్వారా రూ.50 కోట్లు బిల్లులు చెల్లించారన్నారు. ఆన్లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపులకు నేరుగా థర్డ్పార్టీ యాప్లను వినియోగించే అవకాశం లేకపోయినప్పటికీ, 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్ ద్వారా ఫోన్పే, జీ పే, పేటిఎం, ఇతర యాప్స్తో పాటు నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. విద్యుత్ సమస్యలను ఫిర్యాదు చేయడం, బిల్లు వివరాలు, బిల్లు లెక్కింపు వంటి మరెన్నో ఫీచర్లు ఈ యాప్లో ఉన్నాయన్నారు. క్యూఆర్ కోడ్ను స్కాన్ చేయడం ద్వారా, https://play.google.com/store/apps/details?idRcom.apepdcl.easternpower&hlRen లింకు ద్వారా ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి సురక్షితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులను సురక్షితంగా, సులభతరంగా చెల్లించవచ్చని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి 33 కెవి ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు నరుకుతున్న కారణంగా మారేడుమిల్లి సబ్ స్టేషన్కు సంబంధించి మారేడుమిల్లి మండలం పరిసర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ ఎండి.యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

చింతూరు : చింతూరు 33 కెవి, 11 కెవి లైన్ల్లో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏడిఈ ఒక ప్రకటనలో కోరారు.

ఇంటి నిర్మాణ సామాగ్రి వితరణ

ప్రజాశక్తి- విఆర్.పురం: మండలంలోని రామవరంలో కూర లక్ష్మయ్యకు ఇంటి నిర్మాణ సామాగ్రిని జమాల్ ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన గురువారం అందజేశారు. రామవరం గ్రామానికి చెందిన కూర లక్ష్మయ్య ఇల్లు వారం రోజుల క్రితం ఈదురుగాలులకు కుప్ప కూలిపోయింది. ఈ విషయాన్ని స్థానికులు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్కు తెలియజేయగా, ఆయన బుధవారం రామవరంలో కూర లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంట్ రేకులు, ఇనుప పైపులు తదితర సామాగ్రిని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు జమాల్ఖాన్ గురువారం రూ.16 వేలు విలువ గల సిమెంట్ రేకులు, ఇనుప పైపులను తమ ట్రస్టు జెకెసి ట్రస్టు ద్వారా గ్రామ పెద్దల సమక్షంలో బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగే కుటుంబ అవసరాల నిమిత్తం బియ్యం, ఉప్పు పప్పులను అందజేశారు. గ్రామ పెద్దలు గొర్రె కృష్ణయ్య. మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, సర్పరాజ్, రాజ్ కూర పెదనాగేశ్వరరావు, గొర్రె రాముడు, పూజ బోయిన సురేష్, గొర్రె వెంకటేశ్వర్లు, కోట్ల బాలయ్య, జెకెసి ట్రస్టు సభ్యులు ఎస్కె. షాజహాన్, రియాజ్, ఇంతియాజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి- గాజువాక: షీలానగర్ అప్ కీప్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో షీలానగర్ కమ్యూనిటీ సెంటర్లో గురువారం ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, ఇతరత్రా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.సుభద్ర, డాక్టర్ సుధానంద్ మాట్లాడుతూ, కేన్సర్పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ అర్జున్, నాయుడు, లతా రాజేశ్వరి, అసోసియేషన్ సెక్రెటరీ వై.సత్యవతి, పిఎస్ఎన్ రాజు, సత్యారావు, సుబ్బరాజు, శ్రీనివాస్, జానకి పాల్గొన్నారు.